# అమ్మమ్మగారూ ఆపిల్ చెట్టూ

బజారునుండి యింట్లోకి ఆపిల్ పండ్లు రావటం మొదలు - "ఆ గింజలన్నీ ఊరికే పారవేయకండర్రా! ఓ చోట పోగేయండి. నేను దొడ్లో పాతుతాను వాటిని" అంటూ అమ్మమ్మగారు పాట ప్రారంభించడం మాకు క్రొత్తకాదు. పుట్టిన దాదిగా జోలపాట యెలాగ వింటూన్నామో ఈ పాటా అలాగే వింటూన్నాం. అయితే ఫలితం మాత్రం శూన్యం.

"ఛ. ఏం పిల్లలో! ఒక్కమాట మీదైనా కాస్త గురి ఉంచరు. ఇల్లంతా తిరిగి తింటూ ఎక్కడ పడితే అక్కడే ఉమిసి పారేస్తారు. ఒక్క గింజైనా దొరకలేదు. ఎక్కడని వెతకనూ?" అంటూ అమ్మమ్మగారు తలచూ విసుక్కొంటూండటం పరిపాటి.

"అబ్బబ్బ! పిల్లలు పెద్దవాళ్ళలాగా ఒక్కచోటే కూర్చుని తింటారటమ్మా? పోనిద్దూ వెధవ గింజలూ." అంటూ అమ్మ అప్పుడప్పుడూ సర్దిచెప్తూంటారు.

ఎప్పుడైనా బుద్ధికుదిరి, నేనూ చెల్లాయి ఒకటో-రెండో గింజలు ఏ కిటికీలోనో, అల్మారాలోనో దాచినా అవి ఏ పని

మనిషో, వంటమనిషో తుడిచి పారవేసేవారు, గింజలు మాత్రం పత్తా దొరికేవి కాదు.

"ఏమే, బూజులూ, తుక్కూ, చెత్తా అయితే సరిగా తుడవటానికి నీకళ్ళు కన్పించవు కాని, ఎక్కడో మూలనున్న ఆ గింజలట్లా తుడిచి పారేస్తావేం? కళ్ళు కన్పించటంలా? ఇవాళ చెయ్యి కాస్త తీరుబాటయ్యాక పాతి పెడదాం కదా అని అక్కడ నాలుగు ఆపిల్ గింజలు దాచాను!" ఓ శుభోదయాన పనిమనిషిని అమ్మమ్మగారు ఘాటుగా చీవాట్లు వేయడం విన్పించి, మేమందరం ఆసక్తిగా గుమిగూడాం అక్కడ.

"అయ్యో ఓపిల్ గింజలో, బంగారం యిత్తనాలో!— గంజీ కూడూ తినేవోలం మాకేటి తెలుత్తాయమ్మా? మీ పనులు సేస్తున్నందుకు కళ్ళు గూడా పోవాల యిక!" గయ్యిమన్నది పనిమనిషి.

"చేసిన బుద్ధితక్కువపని చాలక ఇంకా ఎగసిపడ్తున్నావేమే? ..." అమ్మమ్మగారు ఇంకా ఏదో అనబోతూండగా పెద్దక్క ప్రవేశించింది రంగంలోనికి. "ఏమేవ్ రామీ, నిన్ను అయ్యగారెందుకో పిలుస్తున్నారు చూడు. వెళ్ళు." అంటూ పనిమనిషిని బయటికి పంపేసింది. "అమ్మమ్మా! అసలే దాన్ని మొగుడు తప్పత్రాగి వచ్చి రాత్రి చావగొట్టాడట. అది ప్రాణం మండివుంటే - ఇంకా మనం తిడితే పడ్తుందా? ఒళ్ళు నొప్పులంటూ ఇంట్లో పడుకోకుండా పనిలోకొచ్చింది. అదే పదివేలు. మానేసిందంటే అంట్లగిన్నెలన్నీ తోముకోవాలి మనం. ఆపిల్ గింజలు దేవుడెరుగు

గానీ, దాన్నేం అనకు యివ్వాళ." అంటూ చెప్పుకొచ్చింది పెద్దక్క.

పెళ్ళై, కాస్త పెద్దరికం సంతరించుకున్నది కనుక పెద్దక్క అమ్మమ్మగారి ఎదుట నిలబడి మాట్లాడవచ్చు.

"అయ్యో పాపం! నాకు తెలియదే ఆ సంగతీ!" అమ్మమ్మగారి జాలిగుండె ద్రవించి ప్రవహించడం ప్రారంభించింది. "ఆడది - రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించి పెడ్తూంటే తినలేక - ఎదురు దాన్ని కొట్టి హింసించడం కూడానా సిగ్గులేక? తప్పుడు వెధవ! 'పండక్కి డబ్బులంటూ వస్తాడుగా' ఝాడిస్తానులే!"

ఈ విశేషంలో తాత్కాలికంగా ఆపిల్ గింజల సంగతి మఱచి పోయారు, అమ్మమ్మగారు.

"ఒసేయ్ రామీ! ఇటురా! రాత్రి తన్నులు తిని, ఏడ్చి పడుకుని వుంటావ్. తిండి తిన్నావో లేదో! దా. ముందీ చద్దన్నం తిను. ఆ ఉత్తరం గదిలో మామిడి పళ్ళున్నాయ్, రెండు తెచ్చుకో. ఆనక కాస్త వేడి వేడి కాఫీ ఇవ్వు అమ్మాయ్ దానికి!-" ఇక ఆ రోజంతా పనిమనిషి అదృష్టం పండేకదా!

## 2

క్రమంగా ఆపిల్ పళ్ళు పళ్ళరూపంలో మా చేతికి రావటం మానేశాయి. మమ్మల్ని (అనగా మా పిల్ల సజ్జును) సాధించి లాభం లేదనుకున్న అమ్మమ్మగారు పళ్ళన్నీ తామే

స్వయంగా ముక్కలు కోసి, ముందు గింజల్ని భద్రంచేసి, అప్పుడు ముక్కలు మా కిచ్చేవారు. "ఛీ, నాకీ ముక్క వొద్దూ, పెద్ద కాయే కావాలీ" అంటూ చంటితమ్ముళ్ళు తిక్కగా ఏడ్చినా కనికరించేవారుకాదు. "మా నాయన కదూ ? చక్కగా ఆ గింజలు పాతితే, అది పెద్ద చెట్టయి కాయలు కాస్తే, జామ కాయలూ, మామిడి కాయలూ, సీతా ఫలాలూ ఎలా కోసుకు తింటున్నాం ? అలాగే అవి కూడా ఎంచక్కా మన దొడ్లోవి, మన చేత్తో కోసుకు తినొచ్చు. ఇప్పటి కివి తిను" అంటూ ఓపిగ్గా నచ్చ జెప్పే వారు. జామ చెట్లెక్కి కాయలు కోసుకున్నట్లే, యాపిల్ చెట్టు ఎక్కి స్వహస్తాలతో కాయలు త్రెంచుతూ కొరుక్కు తింటూన్న ఆనందకరమైన సన్నివేశం ఊహాపథంలో మెద లగా, ఆ వెఱ్ఱివాళ్ళు ఏడవటం మానేసి ముక్కలనే మహా ప్రసాదంగా అంగీకరించేవారు.

వానాకాలం మొదలైంది. రెండు పెద్ద వానలు కురిసి వెలిశాయి. ఆ సాయంత్రం పొలంనుంచి పాలేరును రప్పించి దొడ్లో కూర పాదులవీ నాటించుతున్నారు, నాన్నగారు.

అమ్మమ్మగారికూడా శుభముహూర్తం ఆ వేళే కుదిరింది. "పదమ్మాయ్. ఆపిల్ గింజలు నాటుదాం." అంటూ తాము జాగ్రత్త చేసిన విత్తనాల పొట్లం తీసుకుని దొడ్లోకి నడిచారు అమ్మమ్మగారి ప్రయత్నం చూస్తూనే రాముి గునపం తీసుకొచ్చి సిద్ధంగా నిలబడింది.

మహాయజ్ఞం చూడబోతున్నంత సంబరంగా గుమి గూడాం పిల్లలమందరం అమ్మమ్మగారి చుట్టూ !

ఒక మహాసభలో ఉపన్యసించేముందు సభనంతనూ ముఖ్యమంత్రిగారు తిలకించినంత దర్పంగా, విశాలమైన అంగణాన్నంతనూ ఒక్కసారి కలయజూచా రామె. 'ఇక్కడ లంకెబిందెలు దొరుకుతాయి సుమా!' అని ఏ స్వాములారో చెప్పినంత దర్జాగా 'ఇక్కడ' అన్నారు ఒక చోటును వ్రేలితో చూపుతూ, మరు క్షణంలోనే రామి అక్కడ త్రవ్వకం ప్రారంభించింది.

"ఒరేయ్! అమ్మమ్మ వన మహోత్సవం చేస్తూన్న ప్రైమ్ మినిష్టర్ లాగుందిరా అచ్చంగా? ఓ ఫోటో తీద్దామా?" కోతి గుణాలకు నిలయమైన చిన్నన్నయ్య అన్న మాటలకు అందరం ఫక్కున నవ్వాం.

చిరకాల ప్రయత్నం ఫలించబోతూన్న కారణంగానో యేమో, అమ్మమ్మగారి కాట్టే కోపం రాలేదు. ఆమెగారు ఏదో అనేలోగానే, వంటింటి కిటికీలోంచి చూస్తూన్న అమ్మ మందలించారు: "నోళ్ళు మూయండి, పెద్దవాళ్ళతో హాస్యాలు, బుద్ధిల్లేక!"

అందరం నోళ్ళు మూశాం.

అమ్మమ్మగారు సరిగా గింజలు పాతిపెడుతూన్న శుభ తరుణంలో రామికి ధర్మసందేహం కలిగింది; "పెద్దమ్మ గోరూ! ఇన్నాలగా ఎన్ని తడవలు తమరు ఈ గింజలు నాటినారు? ఒక్కటీ మొలకెత్తనేదూ ఇప్పుడు మాత్రిం–"

"ఛీ, నోర్మూయ్, శకునపక్షీ!"

ఒక్కటే బాణం రామి నోటిని కుట్టేసింది.

"ఒరే. వెంకా, ఇటురా!"

సదరు వెంకడూ ఉరఫ్ వెంకన్న హాజరయ్యాడు, నాన్నగారు చేయించుతూన్న పనిని తాత్కాలికంగామానేసి.

"ఇదుగో. అక్కడ నేను పిత్తనాలు నాటాను-"

"అయ్యేటెయ్యి పెద్దమ్మగారూ ?"

"ఏవో ఇంగిలీషు పళ్ళ విత్తనాల్లేరా, నీకేం తెలుస్సె."

"సిత్తం !"

"అమ్మమ్మా ! ఇంగిలీసు కాదు. ఇంగ్లీష్!" తమ్ముడి సవరణ.

"ఏడిశావులే. నేనేమన్నా మీలాగా వెలకు వేలూ గుమ్మరించి చదువుకున్నానా మరీ ? - విన్నావా వెంకా, ఇక్కడ యిక నువ్వేమీ సవరించకు. "తెలియదండమ్మగారూ" అని మళ్ళీ వెధవ మొహం పెడ్తావ్. ఇక్కడెవరూ అడుగులు వేయకుండా, పశువులవీ తొక్కి పాడుచేయకుండా ఏదైనా చెయ్యి."

"సిత్తం, సిత్తం." అప్పటికప్పుడే యెండిన ఈత కొమ్మలు తెచ్చి, ఆ జాగా చుట్టూ పాతి, కట్టవ లాగా కట్టు దిట్టం చేశాడు వెంకన్న.

"పాచి చేసేటప్పుడు చీపుళ్ళవీ తగిలించకు. జాగత్త!" అంటూ రామికికూడా ఒక హుకుం జారీచేసి మహారాణీ ఠీవితో అచ్చటినుంచి నిష్క్రమించారు.

ఆ మర్నాటినుంచే మాకు రోజూ రెండు పూటలా ఆ ప్రదేశాన్నోసారి తొంగిచూడటం మామూలై పోయింది.

"గింజ పాతిన మర్నాడే మొక్క మొలుస్తుందా ? ఏమిటి ఆత్రం మీకు ? మాటిమాటికీ అటు పోబోకండి. అలా

చూడకూడదు" అని మమ్మల్ని అదలిస్తూన్నప్పటికీ అమ్మమ్మ గారి మనస్సు మాకంటే ఆత్రంతో చిందులు వేస్తూన్న సంగతి మాకు తెలియకపోలేదు రోజూ ఉదయం, సాయంత్రం అక్కడ చెంబెడు నీళ్ళు పోసి, ఏమైనా ఎండుటాకు లవీ పడితే ఏరి పారేసి శ్రద్ధగా కాపలా కాచేవారు.

వారం రోజులు గడిచాయి.

ఒక్క మొలకైనా కన్పించలేదు.

పది రోజులు గడిచాయి. ఒక మొక్క లేచింది. అమ్మమ్మగారితోపాటు మా అందరి ముఖాలు వికసించాయి. కాని ఆ మర్నాటికే తేలిపోయింది - అది చింత మొక్క. ఎప్పుడో ఎలాగో పడిన చింతగింజ మొలిచింది. అమ్మమ్మ గారు కసిగా పీకి పారేశారు దాన్ని. మేం కిమ్మనలేదు. చిన్నన్నయ్య మాత్రం, "ఇవాళ చింత చెట్టు మొలిచింది. రేపు కుంకుడు మొక్క మొలుస్తుంది. భలే" అన్నాడు కొంటెగా.

"ఏం వాగుతున్నావ్; కాయలు కాస్తే తినలేకా ఏమిటి? అవే మొలుస్తాయి. గింజలు మొలవక ఏమౌతాయి? ఇంగిలీసు గింజలు కదూ-కొంచం ఆలస్యంగా మొలుస్తాయి!" అన్నారు ధీమాగా.

"మహా వ్యవసాయ పరిశోధకురాలిలాగా చెప్తోంది!" చిన్నన్నయ్య గొణుగుడు

"నోరు ముయ్యి! నాకు తెలియకపోతే ఎవరికి తెలుస్తుందిరా? వేలెడేసి లేరు - నాకే పాఠాలు చెప్తారా?"

"నిజమే! వందలకొలదీ ఎకరాలు సాగుచేసిన గొప్ప

భూస్వామి కుమార్తె ; లెఖలేనంత ఆస్తిగల చోటా జమీం దారుగారి భార్య మా అమ్మమ్మగారు ! ఆమెకు గాక మరెవరికి తెల్సు ? మే మెంతటివాళ్ళం ఆమెకు చెప్పేదానికి ?''

మా అనుమానాలూ పోలేదు. అమ్మమ్మగారి ఆశా పోలేదు.

# 3

చూచి చూచి నిరాశ పొంది, ఆపిల్ విత్తనాల సంగతి యించుమించుగా మఱచి పోబోతూన్న మేము, ఒక సాయంత్రం ''ఇదిగోనర్రా, చూడండి ఆపిల్ మొక్క !'' అంటూ వినవచ్చిన అమ్మమ్మగారి ప్రకటనకు నిజంగా ఆశ్చర్య పోయాం. అప్పుడే స్కూళ్ళనుంచి వచ్చామేమో –నించున్న చోటే పుస్తకాలు విసిరేసి పరుగెత్తాం. గిన్నెలు తోము తూన్న రామి ఆ మట్టీ - మసీ చేతులతోనే పరుగెత్తు కొచ్చింది.

బ్రిటిష్‌వాళ్ళని తరిమేసి స్వాతంత్ర్యం ప్రకటించుకొన్న రోజునకూడా మన వీరులు అంత ఠీవిగా నిలబడివుండ రన్పించింది, అమ్మమ్మగారి వదనంలోని విజయగర్వం తిలకించిన నాకు. ''నేను మున్నే చూచాను. అయితే, రెండు చిగుళ్లు వేశాక మీకు చూపించుదా మనుకున్నాను !''

అందరం చూశాం.

చిన్న చిన్న అందమైన ఆకులూ అదీ - మహా తమాషాగా వుంది మొక్క.

"అసాధ్యురాలే అమ్మమ్మ! మొత్తంమీద యాపిల్ మొక్క మొలిపించింది. ఓటమిని అంగీకరించాం!" అంటూ చిన్నన్న హాస్యంగా లెంపలు వాయించుకున్నాడు

"పెద్దమ్మగోరూ!" విన్పించీ విన్పించకుండా దీర్ఘం తీసింది రామి. "అయితే మీరు అన్ని గింజలు పాతిపెట్టినారు గందా, ఈ ఒక్కటే మొలిసినాదేమీ? అహాఁ. అది ఓపిలు సెట్టేనా అని నా యిది!' అంటూనే మసి చేతులే చెంపల కానించుకుంది.

"ఆఁ. కాక మరేమిటీ? అదుగో, ఆ ఆకును ఇంకా వదలకుండా వ్రేలాడ్తూన్న ఆ గింజ చూస్తే తెలియటం లేదూ? ఇది యాపిల్ చెట్టే!" నిశ్చయంగా ధ్వనించింది గొంతు. "కాకుంటే అన్నింటిలో అదొక్కటే ముదురు గింజ అయ్యుంటుంది."

మేం ఆశ్చర్యంగా, అబ్బురంగా ముఖ ముఖాలు చూచుకున్నాం హైయ్యర్ క్లాసెస్‌లో సైన్సు మేష్టారు చిక్కుడు గింజ మొలకెత్తుట, శీతోష్ణస్థితి, బీజదళములూ, గాజు జాడీలో నీళ్ళూ అంటూ పెద్ద ప్రళయంగా పది పేజీలు చెప్పుకొచ్చే విషయాన్ని ఏమీ చదువుకోని అమ్మమ్మగారు అంత సూక్ష్మంగా చెప్పగలిగారంటే నిజంగా ఆమె ఎంత ప్రజ్ఞాశాలి!

ఇంత కాలంగా జరిగినదే ఒక యజ్ఞమని మేం అపోహ పడ్డాంగానీ, అసలైన యజ్ఞం యిప్పుడే మొదలైంది.

ఆ ఆపిల్ మొక్క జానెడు ఎదగగానే అమ్మమ్మగారికి

ఆందోళన పట్టుకొంది, అది ప్రస్తుతం వున్నచోటులోనే ఉంటే దానికి సరైన రక్షణ వుండదని !

ఇంకేం, రాజుగారు తలచుకొంటే దెబ్బలకే కొదువా ?

వంటింట్లోంచిగానీ, భోజనాల గదిలోంచిగానీ, దేవుడి గది కిటికీలోనుండి గానీ, మేడ బాల్కనీలోనుండి గానీ, పడగ్గది పక్క కిటికీలోనుండి గానీ, మధ్య హాలులోనుండి గానీ - ఇన్నిమాట లెందుకు - ఆమెగారు యెప్పుడు యెక్కడ నుండి దృష్టి సారించినా ఆ మొక్క కనబడే విధంగా దాన్ని ఉన్నచోటునుంచి తీసి, క్రొత్తచోట-అనగా ఆవరణ మధ్యగా పాతిపెట్టారు. మఱలా దానికి చుట్టూ కట్టుదిట్టాలు జరిగాయి. పనిమనిషీ, పశుల కాపరీ, పాలెగాడూ వగైరా బృందమంత టికీ మఱలా ఆజ్ఞలు జారీ అయ్యాయి - "ఘనత వహించిన ఆపిల్ మొక్క ఇక్కడ పాతబడింది ఎవ్వరూ పాడుచేయ కుండా ఒళ్ళు దగ్గఱ పెట్టుకొని జాగ్రత్తగా బ్రతక" మని.

"వటుడింతై" అన్నట్టుగా అమ్మమ్మగారి అపురూప సంరక్షణలో ఆపిల్ మొక్క యింతై, అంతై, చెట్టై, మాను కూడా యేర్పడబోతోంది మూడేళ్ళు తిరిగేసరికే. మాచంటి చెల్లాయినీ, బుజ్జి తమ్ముణ్ణీ ఎంత అల్లారు ముద్దుగా పెంచు తున్నారో - అంత ఓపిగ్గానూ, ప్రేమగానూ ఆపిల్‌కు కూడా సేవచేసే అమ్మమ్మగారి ఓర్పుకూ, దీక్షకూ మాకు ఆశ్చర్యం కలిగేది. ఎవరు కాస్త వ్యవసాయం విషయాలవీ తెలిసిన వాళ్లొ చ్చినా వాళ్ళని నిలేసి, "ఆపిల్ చెటుకు సంరక్షణ యెలా జర

గాలీ, ఏం ఎరువులు వెయ్యాలీ, ఎన్నేళ్ళకి కాపు పడుతుందీ" వగైరా విషయాల్ని ఆరాగా అడిగి తెల్సుకునేవారు.

"వాళ్ళందర్నీ ఎందుకమ్మా అడుగుతావ్. వాళ్ళ మొహాలకేం తెలుసనీ! ఈ మన వాతావరణంలో ఆపిల్ మొక్క పెంచడమనేది మాటలు గాదు..." అంటూ మే మెవరమైనా చెప్పబోయినా విన్పించుకొనేవారు కాదు. "మాటలేం ఖర్మ, చేతలలో నేను చూపెడ్తాంటే! మీ చేతులతో మీరే కోసుకు తింటారుగా?" అంటూ సవాలు చేసేవారు.

## 4

వరా ఆపిల్ మొక్కకు మూడేళ్ళు ముచ్చటగా నిండబోతూన్న శుభ సమయంలో ఓ గండం సంభవించి, గడవటంగూడా జరిగింది.

ఆ గండం ఏమిటీ అంటే —

ఆవుల్నీ గేదెల్నీ బయటకు మేతకు తోలుకుపోయి పాలేరు సాయంత్రం తిరిగి తీసుకు వచ్చి వాటిని కట్రాటలకు బంధించేలోగానే ఒక గేదె విజృంభించి దొడ్లో చెట్లన్నిటి పైనాబడి వీరవిహారం చేసి దాని ప్రతాపం చూపింది.

ఉన్న చెట్లన్నిటినీ అది సమూలంగా నాశనం చేసినప్పటికీ యేమంత ఫర్వాలేదు గానీ బుద్ధిలేని ఆ పశువు, అపురూపంగా పెంచబడుతూన్న ఆపిల్ మొక్క కొమ్మలు కూడా

కథా నిలయం
4747
శ్రీకాకుళం

రెండు విరగ్గొట్టి పారేసింది. ఇంకేముంది - అమ్మమ్మగారు రౌద్రమూర్తే అయ్యారు.

"ఏరా దరిద్రుడా, కళ్ళు నెత్తికెక్కాయా, అసలు పశువులలా చెట్లన్నీ నాశనం చేస్తూంటే ఎక్కడేడుస్తున్నావు నువ్వూ?"

"సిత్తం. ఎక్కడా ఏడవడంలేదు. ఓదరినుంచి ఆవుల్నీ దూడల్నీ సర్దుకొస్తున్నాను. అంతలోనే గేద సెట్లమీద బడ్డాది. అక్కడికే ... ..."

"ఛీ. అప్రయోజకుడా, యెదురు సమాధానాలు కూడాను. అయ్యో, చక్కగా గుమ్మటంలా యెదిగిందమ్మా చెట్టూ, యేకంగా రెండు పెద్ద కొమ్మలు విరిచేసిందీ! ... పశువుల్ని తోలుకెళ్ళి మేపకుండా యెక్కడో కట్టి పారేస్తూన్నాడు కాబోలు ఒళ్ళొంగని సన్నాసి. లేకుంటే అది వస్తూనే ఆవురావురుమని చెట్లమీదెందుకు విరుచుకుపడ్తుందీ?"

"అంతేనండి మరి!"

ఆ ధ్వని వినవచ్చిన దెస మళ్ళాయి అమ్మమ్మగారి చూపులు. షెడ్డులో కారును కడుగుతూన్న డ్రైవరు అప్పారావు పళ్ళికిలిస్తున్నాడు. వాడికీ పాలేరు వెంకడికీ విరోధం. గనుగ వెంకన్నకు తగుల్తూన్న చీవాట్లు అప్పారావుకు ఆనంద కారణమయ్యాయి, కాని వాడి ఆనందం అమ్మమ్మగారి ఆగ్రహాన్ని మరింత యినుమడింపజేసింది.

"హోరి, అప్పిగాడా! నువ్వా ఇక్కడే చచ్చావా? ఏం, గేదె వాడికి వొంగకపోతే నువ్వు కాస్త పోయి సాయం

చేస్తే ఏమన్నా అరిగిపోతావా ? అలా చూస్తూ వూరుకుంటావా. అవి చెట్లని నాశనం చేస్తూంటే ?"

"బాగుందండి. అది నా పనికాదు," బిగుసుగా వుంది అప్పారావు సమాధానం.

"ఏమిటీ ?" రెచ్చిపోయారు అమ్మమ్మగారు. "తిన్న యింటిమీద ఆ మాత్రం విశ్వాసముంచక్కర్లేదట్రా ? కాస్త పనిసాయం చేస్తేనే నామర్దా అట్రా నీకూ ? మేం ఎన్నెన్ని పనులు చేసుకోవటం లేదూ ?"

'బాగుందండి. మీ యింట్లో పని మీరు చేసుకుంటారూ ! ఇశ్వాసమేంటీ ఇశ్వాసం ? ఇవాళ పశువుల్ని కాయమన్నారు, రేపు పాకీదొడ్డి తుడవమంటారు !"

"నీ అఘాయిత్యం కూలా! పశువుని కట్టేయమన్నానా, పశువుల్ని కాయమన్నానురా నిన్నూ ? మరీ అంత విరగబాటుంటే నౌఖరీ చెయ్యలేవు సుమా !"

"ఎందుకండీ యెప్పుడో యెందుకూ, యిప్పుడే సెయ్యనూ, యిన్ని మాటలు గాశాక యింకా యెవళ్ళికావాలి యిక్కడ నౌఖరీ ? ఇప్పుడే పోతాను."

వాడా మాట అనటమే గానీ, ఉన్నచోటు నుంచి మాత్రం కదలలేదు.

"ఊఁ పోరా. ఇంకా కదలవేం ?" ఓ మేఘ గర్జన మేడమీద నుంచి వినవచ్చి, అందరం తెల్లబోతూ అటు చూశాం. ఎప్పటినుంచి ఇదంతా నిశ్శబ్దంగా గమనించుచున్నాడో తెలియదు కాని, ఒక కనుబొమ పైకెత్తి, నిప్పులు కురిపించే నేత్రాలతో నిలబడివున్నాడు పెద్దన్నయ్య

మేడ వరండాలో. ఓ కనుబొమ పైకి లేచిందీ అంటే వాడి కోపం చాలా తారస్థాయిలో వుందని మాకు సంకేతం. అది అప్పారావుకూ తెలుసు. అందుకే బిక్క ముఖంతో, "అది కాదు పెద్దబ్బాయిగారూ—" అని ఏదో చెప్పబోయి నసుగుతూ మానేశాడు.

"ఏడిశావ్ నోర్ముయ్ !" మేడ మీదినుంచి మరో ఉరుము. అవసరమైతే నేనే కారుక్రింద పడుకుని బాగు చేసుకుంటాను ! కారు కడుగుతాను. ఇక నీ కొచ్చిందల్లా బేషజం. ఏం, నాన్నగారి దగ్గర్నుంచీ అందరూ పశువులకు మేత అవీ వేస్తూ స్వయంగా చేసుకోవటంలే ? పెద్ద జమీందారులా మాట్లాడ్తున్నావ్ ! పెద్దమ్మగారినే యెదిరించి మాట్లాడ్తావ్‌రా ?"

"సరే, జమీందారునైతే మీ బోటి జమీందార్ల దగ్గఱ ఊడిగం చేసికండి నాకూ ?" విన్పించీ విన్పించకుండా అన్నాడు. కానీ, అందరికీ స్పష్టంగా విన్పించింది.

అంతే, మేడ మీది పెద్దన్న రెండు క్షణాల్లో క్రిందికి దూకినట్లుగా దూకుడుగా రావటమూ, అప్పారావును మెడ బట్టి గేటు బయటివఱకు గెంటివేయుటమూ జరిగిపోయింది.

అయితే, మూడు రోజుల తర్వాత అప్పారావు వచ్చి బ్రతిమిలాడినా వాడిని మళ్ళీ పనిలో జేర్చుకోకపోవటమూ, ఆ నాటినుంచి ఈనాటి వఱకూ మా కార్లకు డ్రైవరు లేకపోవటమూ వేరే సంగతి !

"సమయానికి చండప్రచండులైన నాన్నగారు ఇంటి దగ్గఱ లేకపోవటం కొంత మేలు !" అని గుసగుసలాడు

కుంటూన్న నేనూ పెద్ద చెల్లాయీ అమ్మమ్మగారి దృష్టిలో పడ్డాం.

"ఏమే, ఇంట్లో కాస్త ఎదిగిన పిల్లలున్నారని వ్రేలెడంత సాయమేమన్నా ఉందా ? మీరేం పెద్ద పనిపాటలు చేయాలా ఏమన్నానా? కాస్త ఆ పనివాళ్ళు సరిగా చేసిఛస్తున్నారో లేదో చూసుకునే తెలివిలుకూడా లేవా ?"

మే మిద్దరం కిక్కురుమన లేదు.

ఆవిడ వ్యాఖ్యానం ఇంకా సాగింది. "అయ్యో రాత ! రేపు పెళ్ళిళ్ళయి వెళ్ళి మీ ఇళ్ళల్లో ఎలా దిద్దుకువస్తారే యిలాగైతే ? అస్తమానూ ఆ పుస్తకాలు పట్టుక్కూర్చుంటారు - అవేం కూడూ గుడ్డా పెడతాయా ఆడపిల్లలకీ ? ఎవరి పిల్లలనైనా చూస్తే ముచ్చట వేస్తుంది - వేలెడంత వాళ్ళూ చిత్రాలు ముగ్గులెట్టుకొస్తారు; మీకు ఏ తెలివిలూ ఏడవ లేదు..."

అమ్మమ్మగారు యింకా యింకా ఎంత చక్కటి అభిప్రాయాలు సెలవిస్తారో ననే భయంతో మేం మెల్లగా మా చదువుల గదిలోకి జారుకున్నాం.

"బేబీ ! అమ్మమ్మ చదువుకోలేదు కానీ, కాస్త చదువే ఉంటే కాళిదాసు, నన్నయ, తిక్కనలకంటె గొప్ప కవిత్వం రాసి ఉండేదని నా అభిప్రాయం. అప్పుడప్పుడూ భలే పెద్దపెద్ద మాటలూ, చక్కటి ఇడియమ్సూ వేస్తూంటుంది లే!" ఎప్పుడూ ఆ కావ్యాలూ ఈ గ్రంధాలూ తెగచదివే చిన్నన్న వ్యాఖ్యానించాడు.

"ఇంతకూ, అమ్మమ్మ మాటిమాటికీ 'చితాంలు ముళ్లు పడతారు' అంటుంది, ఏమిటే అదీ ?" చెల్లాయి నడిగాను. "ఇది ఏ పరిభాషలోనిదో నీకేమైనా తెలుసా ?"

"నోరు ముయ్యి. అమ్మమ్మ కోపంగా ఉన్నప్పుడే నీకీ ధర్మ సందేహాలన్నీ వస్తాయి !"

"వయస్సుకు చిన్నదైనా మహా ఆరిందాలాగా మాట్లాడ్తుందది, అక్కడే వస్తుంది నాకు కోపం.

"అసలు తప్పు చేసినవాడు పాలేరు వెంకన్న. ఉద్యోగం ఊడిపోయినది మాత్రం డ్రైవర్ అప్పారావుకి. భలే, మహా గొప్ప విడ్డూరం" అన్నాడు తమ్ముడు.

ఎన్నను కున్నా చూలో మేమే ! అమ్మమ్మ యెదుట నోళ్ళు విప్పం గదా !

ఈ చిన్న గాలి దుమారం తర్వాత చెప్పుకోతగిన మార్పులు చాలా జరిగాయి.

ఆవులూ, గేదెలూ, దూడలూ వాటి తాలూకు తవుడు బస్తాలూ, చిట్టుడమ్ములూ, మినపపొట్టు, తెలగపిండి వగైరా దానాల శబ్దాలూ, ఎండు గడ్డిమేట్లూ సర్వం పొలం తరలించబడ్డాయి.

ఈ తరలింపు నిమిత్తం, కూలీలకు గాక కేవలం వాటిని మోసుకెళ్ళిన లారీలకే నూటయాభై రూపాయలైపోయాయని నాన్నగారు విచారించారు. ఈ తరలింపు నిజానికి ఆయన కేమాత్రం ఇష్టంలేదు. నోరులేని ఆ పశువులంటే ఆయనకు తన బిడ్డలమీద కూడా లేనంత ప్రేమ. అర్ధరాత్రుళ్ళుకూడా

లేచి వాటి దగ్గఱ నీళ్ళూ మేతా ఉన్నాయో లేదో చూచి స్వయంగా తామే యింత గడ్డి వేసి, నీళ్ళ బాల్చీలు మోసుకు వెళ్ళి త్రాగించీ తాపత్రయ పడ్తుంటారు. "రామన్నా, లక్ష్మన్నా" అంటూ నాన్నగారు ఒక్కోదాన్ని పేరుపెట్టి పిలుస్తూంటే అవి రంకెలు వేస్తాయి సంతోషంగా సమాధానంగా. పొలంలో పాలేళ్లు వాటిని సరిగా చూడరనీ, వేళకు నీళ్ళూ మేతా పెట్టకుండా నిర్లక్ష్యం చేస్తారనీ నాన్నగారి బాధ.

అయితేనేం, అమ్మమ్మగారి ఆపిల్ పై అనురాగం ముందు నాన్నగారి భూతదయ తల వంచింది

ఇంతే కాదు, మార్పులు యింకా జరిగాయి.

నాన్నగారు ప్రత్యేక శ్రద్ధతో పెంచుతూన్న అరటి తోట ఆరడుగులు దూరం జరిగింది. చెట్లూ, దుంపలూ, పిలకలూ అన్నీ వెతకి వెతకి తవ్వించి పారేశారు అమ్మమ్మగారు దగ్గరుండి. ఎప్పుడైనా గాలివానా వగైరాలు వస్తే ఆ అరటి చెట్లు యీ యాపిల్ మొక్కపైనపడి నాశనం చేస్తాయేమోనని అమ్మమ్మగారు ముందే జాగ్రత్త వహించారన్న మాట!

ఇంటికి వస్తూనే పశువుల అజమాయిషీ కనుక్కోవడం, చెట్లకు బాల్చీలకొలదీ నీళ్ళు తోడి పోయడం (ఆఖరుకు అనారోగ్యంగా వున్న రోజున కూడా) నాన్నగారి ముఖ్యమైన హాబీలలో కల్లా ముఖ్యమైనవి. ఇంకేముందీ-ఆ రోజు ఇంటికి వచ్చి, సగం తరిగిపోయి బేలగా నిలబడిన అరటితోటను చూసుకొని ఒక్కసారి కోపంగా నౌఖర్లందర్నీ, పిల్లలందర్నీ కేక పెట్టారు. చెట్టుమీది కొంగను భస్మంచేసిన కౌశికుడు

కూడా ఆనాడు అంత మహోగ్రంగా చూచివుండడని నా కనిపించింది, నాన్నగారి మొహం చూస్తే ఆ క్షణాన. చండ శాసనులైన ఆయన ఎదుట మేం నోరు విప్పం, బిక్క ముఖా లతో నించున్నాం.

చేతులు నలుపుకుంటూ, మధ్య మధ్య మాటలు మింగేస్తూ వెంకన్న మెలాగైతే అసలు విషయాన్ని వివరించ గలిగాడు అదిరే గుండెలతో. నాన్నగారికి కోపం వస్తే నోటికీ, చేతికీ కూడా హద్దూ ఆపూ వుండదని వాడికి బాగా తెలుసు.

అంతా విని తలపంకించి ఊరుకున్నారు నాన్నగారు.

వెంకన్న గుండె గుబగుబలు తగ్గాయి.

సహజంగా విశ్వామిత్రులైన నాన్నగారు అంత శాంతంగా మిన్నకుండడ మనేది నిజంగా ప్రపంచంలోని ఎని మిదవ వింత!

రెండ్రోజుల అనంతరం - చిన్నన్నయ్యకు యేం దుర్బుద్ధి పుట్టిందో యేమో-కొన్ని పూల మొక్కలు తెచ్చి ఆపిల్ మొక్క ప్రక్కనే నాటాడు. "అమ్మమ్మ ఆపిల్ మొక్కలే త్వరగా యెదుగుతాయో నా జెంకిస్ మొక్కలే బాగా ఎదుగుతాయో చూడండి" అంటూ పందెం వేశాడు.

సాయంత్రం ఆపిల్ మొక్కకు నీళ్ళు పోస్తూ అమ్మమ్మ గారు ఈ కొత్త మొక్కల్ని చూడనే చూశారు.

"ఈ వెధవ మొక్కలేమిటే యిక్కడ? ఎవళ్ళివి వేసిన వాళ్ళు? ఇంత దొడ్లో ఇంకెక్కడా చోటే దొరకలేదా?" అంటూ కోపంగా వాటిని పీకి పారేశారు.

మరుక్షణంలో చిన్నన్న పెద్ద యుద్ధవీరుడిలా మొఖం పెట్టుకుని చిందులు త్రొక్కుతూ వచ్చేశాడు.

"ఇవి క్రొత్తరకం పూల మొక్కలు. అందుకనే యిక్కడ పాతాను. ఏమి తెలియకుండా పీకిపారేస్తావేం?" అంటూ పెంకెతనంగా తిరిగి అక్కడే నాటే ప్రయత్నం చేస్తున్నాడు.

"ఒద్దు. అక్కడ వెయ్యకు. దీని దగ్గర యింకేదైనా వుంటే దీనకి బలం తగ్గిపోతుంది. ఇంత పెద్ద పెరడులో నీకింక చోటే దొరకలేదా?" అన్నారు అమ్మమ్మగారు అధికారంగా.

"ఔనూ, నీ ఆపిల్‌కి ఇంత పెద్ద పెరడులో యింకెక్కడా చోటు దొరకలేదా! దాన్నే యింకెక్కడైనా వేసుకో, నా పూల మొక్కలు యిక్కడే పెరగాలి.

"ఎవరైనా ముట్టుకోండి వీటిని మరి చెప్తాను" అంటూ తిరిగి అక్కడే వాటిని పాతి మట్టి సరిజేస్తున్నాడు. తాతగారి పేరు వాడు కావడంవల్లనో, పెద్ద చదువులు చదువుతున్నాడనో - ఏ కారణమోగాని అమ్మమ్మగారికి చిన్నన్న అంటే ప్రత్యేకమైన వాత్సల్యం.అందువల్లనే.నేమో వాడు అమ్మమ్మగారితో జంకూ గొంకూ లేకుండా ధాటీగా మాట్లాడగలడు. అయితే ఈ విషయంలో మాత్రం చిన్నన్నకాదు సరి కదా బ్రహ్మదేవుడినైనా సరే అమ్మమ్మగారు క్షమించదలచుకోలేదు.

ఉద్రేకంగా, అన్న పాతిపెట్టిన మొక్కల్ని పీకి ఆమడ దూరం విసిరేశారు.

చిన్నన్నకు శివమెత్తిపోయింది. "ఛీ. వెధవ ఆపిల్ మొక్క. దీనిగురించి దొడ్లో చెట్లన్నీ తరిగిపోతున్నాయి. దీన్న సలు పీకి పారేస్తాను" అంటూ దుమకబోతూన్న సమయంలో యుద్ధభూమిలోనికి శాంతిదూత అమ్మ ప్రవేశించారు.

"ఒరే వేణూ, మతిపోయిందా?"

అమ్మ అదలింపుతో ఠక్కున ఆగిపోయాడు చిన్నన్న. ఆపిల్ మొక్కను పీకబోతూన్న చేతులు వెనక్కు వచ్చేశాయి. వాడేదో అమ్మకు వివరించబోతూంటే అమ్మగారు అన్నారు: "ఆఁ. ఆఁ. లోపల్నుంచి నేనంతా చూస్తూనే ఉన్నాను. ఆ మాత్రం పెద్దంతరం, చిన్నంతరం ఉండొద్దూ? అలాగేనా అమ్మమ్మని యెదిరిస్తావ్?"

"మరి తనేం చేసిందీ? నా మొక్కలు ..."

"తెలుసులే. నీ మొక్కలు మరోచోట వేసుకో నాయనా," నచ్చజెప్తూన్నట్లు లాలనగా అన్నారు. "అమ్మమ్మ తాపత్రయమంతా ఎవరికోసం చెప్పూ? మీకోసం కాదూ? అది పళ్ళు కాస్తే తినేది మీరేనా? లేక అమ్మమ్మ తింటుందా?"

చిన్నన్న మాట్లాడలేదు.

"నీకు నేను సాయంత్రం బజారునుంచి మొక్కల కుండీలు తెప్పించి పెడతాను. వాటిలో వేసుకొని హాయిగా మేడ బాల్కనీలో పెట్టుకో నీ మొక్కల్ని. సరేనా?"

అమ్మ మాటలకు పరమానందం చెందిన చిన్నన్న మరి అమ్మమ్మగారితో తగవు పెంచుకోలేదు.

ఈ విధంగా ప్రతి శత్రువునూ తమ అధికారంతో జయిస్తూ ఆపిల్ మొక్కను రక్షించుకుంటున్నారు అమ్మమ్మగారు. ఆపిల్ మొక్కకు అనతి దూరంలోనే ఉన్న కారు షెడ్డు లోనికి కారు రాకపోకలుకూడా బంధించబడ్డాయి. గేటుకు దగ్గఱగానే మరో కారుషెడ్డు వేయబడింది. అలాగా ఆపిల్ మొక్క కేంద్రంగా, చుట్టూ పదడుగుల వ్యాసార్థంలో ఎటు చూచినా ఆ వృత్త పరిధిలోనికి ఏమీ అడుగిడకుండా, ఏ మొక్కా పెరగకుండా నిర్దిష్టమైన కట్టుబాట్లు చేశారు.

నాన్నగారితో ఏదో పనుండి ఒకరోజు అమెరికన్ మిషనరీ డాక్టర్ ఒకతడు వచ్చాడు మా ఇంటికి. మాటలైన తర్వాత అతడు వెళ్ళిపోవటానికి తయారైతే కారు కదలదే! సరే, కార్ల విషయాలు బాగా తెలిసిన అన్నయ్యలను అదే మిటో చూసి సరిజేసిపెట్టమని ఫర్మాయించారు నాన్నగారు. నౌఖర్లంతా కలసి కారును తోసుకుంటూ వెనక కాంపౌండు లోనికి తీసుకొచ్చారు. అంతాకలసి ఎక్కడ ఆపిల్ మొక్కను ధ్వంసం చేస్తారోనని కాబోలు అమ్మమ్మగారు దాని దగ్గరే నిల బడివున్నారు, తీక్షణంగా చూస్తూ.

"నమస్కారం అమ్మా" అన్నాడు హఠాత్తుగా ఆ డాక్టర్. ఈ మిషనరీలు అందరికీ చాలా గౌరవమిచ్చి మాట్లా డ్తారు. అందరితోనూ పరిచయాలు చేసుకోవాలని ప్రయత్ని స్తారు.

"ఎవరు నీ" వన్నట్లు చూశారు అమ్మమ్మగారు అతడి దెస.

అన్నయ్య ఆమెగారి సందేహనివృత్తి చేశాడు. "ఈయనగారు ఫలానా డాక్టర్" అని చెప్తూ "మా అమ్మమ్మగారు, గార్డెనింగ్ అంటే చాలా యిష్టం. మమ్మల్నందర్నీ పెంచిన ఘామెగారే. మాకు అమ్మకంటె ఎక్కువ" అంటూ పరిచయం చేశాడు.

"ఎంతైనా పొగుడ్తాడు. అడగ్గానే వాడికార్రు కొనిచ్చింది కదూ" అంటూ చిన్నన్న సణుక్కుంటున్నాడు వెనక నిలబడి.

మిషనరీ దొర మొహమంతా నవ్వు పులుముకుని మళ్ళీ నమస్కరించాడు అమ్మమ్మగారికి. "అయితే, మీరు చాలా గొప్ప నర్సు అన్నమాటా!" అన్నాడు యాస తెలుగులో.

"వాడి మొహమా యిరి! నన్ను పట్టుకుని నర్సు అంటాడేమిటే? ఖర్మకాలి నేను నర్సు పని చేయాలా!" అన్నారు కోపంగా అమ్మమ్మగారు అతడు వెళ్ళిపోయాక. "ఆ దేశంవాళ్ళు కదూ? సరిగా మాట్లాడటం రాదు!" అని కూడా అన్నారు.

ఫక్కున నవ్వు రాబోయినా ఆపుకొన్నాం మేము.

"అదికాదమ్మమ్మా, సేవచేసేవాళ్ళ నెవరినైనా 'నర్సు' అంటారు. అది చాలా విలువైన పదం. నిన్ను అతడు చాలా ఘనంగా పొగిడాడన్నమాట!" అంటూ మేం వివరించేసరికి అమ్మమ్మగారు శాంతపడ్డారు.

"అయితే, వాళ్ళ దేశంలో ఆపిల్ చెట్లు చాలా

ఉంటాయి కదూ? వాళ్ళ దేశందేగా అసలీ ఆపిల్?"
అన్నారు సాలోచనగా.

"ఔ" నన్నాం మేం.

ఇంకేం - కోర్టు వ్యవహారాలు గురించి నాన్నగారి దగ్గఱకుగానీ, వర్తకసంబంధంగా అన్నయ్య దగ్గఱకుగానీ వచ్చే విదేశీయు లెవరినైనా సరే - కొంచం పరిచయమైతే చాలు– "ఇది ఆపిల్ చెట్టేనా? ఆపిల్ ఎన్నాళ్ళకు కాస్తుందీ? అసలు దాన్నెలా పెంచాలీ?" అనే వివరాలు అతి ఆసక్తిగా అడిగేవారు అమ్మమ్మగారు.

కొందరు ఔననీ, కొందరు కాదనీ, ఇంకొకరు తెలియదన్నట్టు తటస్థంగానూ ఊరుకొనేవారు.

"వాళ్ళ మొహం. ఏవో నాలు గింగీషు ముక్కలైతే వస్తాయి కాని, వీళ్ళందరికి పెద్ద తెలివితేలేం ఏడుస్తాయీ? వీళ్ళందర్నీ అడగడం దండగ" అనేశారు అమ్మమ్మగారు కడకొకనాడు.

"విదేశీయులంతా ఇంగ్లీషువాళ్ళే కాదమ్మమ్మా. ఇంకా చాలా భాషలున్నాయి" అని సవరించాడు తమ్ముడు.

"ఏవో ఏడిశాయిలే. నాకెందుకవన్నీ?" ఈసడించారు అమ్మమ్మగారు. అన్నేళ్ళూ పెంచిన మొక్క యాపిల్ ఔనా కాదా? ఇంకా కాపు పట్టదేం, అన్న ఆత్రంతో ఆమెగారి ఆగ్రహం ఆనాటి కానాడు అధికమౌతోంది.

"అమ్మమ్మా, ఇంకెంత, రెండేళ్ళు ఓపికపట్టు. నేను అగ్రికల్చర్ బియస్సీ పాసై వచ్చి నీకు కావలసినన్ని మొక్కలు

పెంచి, కాపు కాయించుతాను” అన్నాడు తమ్ముడు అమ్మమ్మగార్ని కాస్త ప్రసన్నులను కావించే ఉద్దేశంతో.

కాని, అబ్బే ! అటువంటి వాటికే అయిసయి పోయే రకమా అమ్మమ్మగారు ?

“అయ్యో. మీ చదువుల భండారం నాకు తెలియకేం నాయనా ? ఆ మధ్య ఓ అగ్గి కలశం (అగ్రికల్చర్) వాడు ‘చెట్లకు జబ్బులు రాకుండా చేస్తాను, కాపు పట్టే మందులిస్తా’ నంటూ రాలా ? దబ్బ చెట్టును చూచి ‘ఆహా ఎంత పెద్ద నిమ్మకాయలు కాశాయి !’ అంటూ ఆశ్చర్య పోయాడు, వాడి అజ్ఞానం కూలా! వాడు యిచ్చిన మందుకు పనస చెట్టు కాస్తా చచ్చి ఊరుకొంది ! మీ సంగతే చెప్పొచ్చావ్ !”

అమ్మమ్మగారు సెలవిచ్చినదంతా ఘాటుగా ఉండటమైతే వున్నదికాని, అక్షరాలా నిజం మాత్రం ఔను. అందుకే యింకెవరూ నోళ్ళు మెదపలేదు.

## 5

ఢిల్లీ నుంచి ముత్యాల నగల వర్తకులు వచ్చారు. అప్పుడప్పుడూ వస్తూంటారు వాళ్ళు ఏడాదికోసారీ, రెండేళ్ళకోసారీని.

“క్రితం సారి ఏవేవో సాకులు పెట్టావ్. నాకీసారైనా ముత్యాల నెక్లెస్ కొని పెట్టకపొతే నేనింక అన్నం తినను.” అని చెప్పేసింది అక్క, అమ్మతో.

"మరి నాకో?" అన్నాను నేను బెదురుతూనే.

అంతలో ఆ మాటలన్నీ హైకమాండ్ అమ్మమ్మగారి చెవిన పడనే పడ్డాయి. అమ్మకి బదులుగా అమ్మమ్మగారి నుంచే వచ్చింది సమాధానం! "పెద్దమ్మాయికి పెళ్ళికి అనేక నగలు పెట్టాం. ఇంక ఇప్పుడు కొనవలసిన అవసరమేం లేదు. చిన్నమ్మాయికి పెళ్ళి కుదరలేదుగా, పెళ్ళికి చేయిస్తాం. ఇప్పుడు మీరాళ్ళే పేచీలేం పెట్టబోకండి."

హైకమాండ్ ఆజ్ఞ జారీ చేశాక మరి మార్పు చేయడం ఎవరితరం? కాని మార్పు జరిగింది అతి విశేషంగా.

ఆ నగల వర్తకులు మా ఇంట్లో బేరం అయ్యేవరకూ తమ కారును షెడ్లో పెట్టుకుంటామన్నారు. ఇంకేం, మా అదృష్టం పండింది.

"ఔనూ. వీళ్ళు ఢిల్లీ వాళ్ళుకదూ!" సాలోచనగా స్వగతంగా అనుకున్నారు అమ్మమ్మగారు, "చూడవయ్యా, ఇది ఏం చెట్టూ?" అనడిగారు వాళ్ళలో ఒకతన్ని.

అతడు అయోమయంగా చూచాడు మొదట.

అమ్మమ్మగారే వివరించారు. "ఆపిల్ చెట్టని మేం అనుకుంటున్నాంలే, అయితే మూడేళ్ళు నిండినా ఇంకా కాపు పట్టలేదనీ, ఔనా కాదా అని అనుమానం వచ్చింది!"

అతడీసారి నిర్భీతిగా, పరిశీలనగా చెట్టువేపు చూచాడు. "ఇది యాపిల్ చెట్టేనమ్మా. మూడేళ్ళంటున్నారు? ఇక ఆలస్యంలేదు. ఇవాళో రేపో అన్నట్టుగా కాపు పట్టవలసిందే ఇక!" అన్నాడు నిశ్చయంగా.

అమ్మమ్మగారి సంతోషం అంతా యింతా కాదు!

అందువల్ల ఆ సంతోష సమయంలో రెండు నెక్లెసులూ, రెండు దుద్దుల జతలూ ఏమాత్రం సంకోచించకుండా కొనేశారు.

"ఆహా ! ఆపిల్ చెట్టా ! నీ దయ ! ఇటువంటి నగల వర్తకులూ, బట్టల వర్తకులూ రోజూ వస్తే ఎంత బాగుండునూ !" అన్పించింది నాకూ, చెల్లాయికీ.

ఆ వర్తకుడు అన్నవేళా విశేషమో ఏమోగానీ, ఆ చెట్టు మరో నెల్లాళ్ళకే పూత పట్టింది. ఇంకేముందీ- పండగే అన్పించింది మాకు. అయితే ఏ పూతా నిలవడంలేదు. గుత్తులు గుత్తులుగా మొగ్గలు వేయడం, పూస్తూ పూస్తూనే రాలిపోవడం, పోనీ ఏ అగ్రికల్చర్ డిమాన్‌స్ట్రేటర్‌నో తీసుకు వద్దామంటే వాళ్ళ తెలివిలమీదా, లోకజ్ఞానంమీదా అమ్మమ్మగారి కసలు గౌరవమే లేదాయిరి !

అలా కొన్నాళ్ళు సాగింది.

ఒకవేళ ఏ ఉడతలైనా వెళ్ళి మొగ్గల్ని కొరికి వేస్తున్నాయేమోనని చెట్టు మొదటకు తారు పూయించారు. చుట్టూ ఖాళీ లేకుండా ముళ్ళతీగ చుట్టబెట్టారు. పైన పక్షులు జేరకుండా అవి దడుసుకుని పారిపోవటానికి, ఒక కొమ్మకు మువ్వలు కట్టారు. పక్షి వాలగానే అవి ఘల్లుఘల్లు మంటాయి. ఆ శబ్దం విని పక్షులు భయపడి పారిపోతాయి. క్రమంగా ఆ చెట్టుమీద వాలడమే మానేస్తాయి. కొమ్మల మధ్యన ఓ పాత నల్లగొడుగు కూడా వ్రేళ్లాడదీశారు, పక్షులను ఇంకా భయపెట్టటానికి. అయినా ఏం లాభం లేకపోయింది. మొగ్గలు మొగ్గలుగానే మాడిపోతున్నాయి.

తన స్వంత తెలివి ఉపయోగించి, తెలిసిన వైద్య మంతా విసుగు లేకుండా చేస్తున్నారు అమ్మమ్మగారు - చెట్టు మొదట్లో పేడనీళ్ళు పోయించడం, సాంబ్రాణి పొగ వేయించడం వగైరాలన్నీ. ఆశించిన ఆపిల్ పండ్లు లేకపోగా ఇదంతా ఒక న్యూసెన్సుగా అన్పించసాగింది మాకు. దొడ్లో చెట్ల సంగతి దేవుడెరుగు కానీ, పొలంలో ఆవులకూ, గేదెలకూ పోషణ సరిగా జరగక చిక్కిపోతున్నాయని నాన్నగారూ, పాలు సరిగా ఇంటికి చేరడంలేదనీ - ఆరోజు కారోజు తరుగుతున్నాయనీ, నీళ్ళు కలుస్తున్నాయనీ అమ్మా అసంతృప్తి పడుతున్నారు. అయినా, నియంతలాంటి అమ్మమ్మగారు అవన్నీ వింటారా?

## 6

అమ్మమ్మగారి ఆపిల్ చెట్టుకు అందంగా అయిదో ఏడు వచ్చింది. కాసిన పాపాన మాత్రం పోలేదు.

"ఏపుగా ఎదగడమే గాని కాపు లేదు. ఆ స్థానే ఏ పనసచెట్టు, మామిడిచెట్టు వేసినా ఈసరికి ఎక్కటికక్కలుగా కాసి ఉండును. నీ మనుమలకోసం దీన్ని పెంచావు గానీ, అమ్మమ్మా, బహుశః మా మనుమలు తయారయ్యేసరికి కాస్తుందేమో!" అన్నాడు చిన్నన్నయ్య ఓనాడు.

అమ్మమ్మగారీసారి ఇదివరలో అంతధాటీగా సమాధానం చెప్పలేదు. చిన్నగా నవ్వి ఊరుకున్నారు.

అగ్రికల్చర్ బి. యెస్సీ చదువుతూన్న తమ్ముడు, తన స్నేహితులతో కలసి ఇండియా అంతా తిరిగివచ్చాడు.

వస్తూనే, "అమ్మమ్మా, నీకో బాడ్ న్యూస్, అంటే చెడు వార్త. నువ్వు క్షమించాలి మరి!" అన్నాడు సీరి యస్‌గా.

అంతా ఏమిటన్నట్లు చూశారు.

"మేం యాపిల్ తోటంలో విహరించి,మా చేతులతో మేం కాయలు కోసుకు తిని వచ్చాం, బాగా పరిశీలించాను. ఏమీ పొరపాటు లేదు. నువ్వు 'ఆపిల్' అంటూ పెంచుతూన్న చెట్టు అసలు 'ఆపిల్' కానే కాదు. ఏదో అడవిచెట్టు కావచ్చు!"

"అడవిచెట్టు పట్నంలో కెలా వచ్చి మొలిచిందం టావ్?" అమ్మమ్మగారి ఎదురు సవాలు.

"ఆ ప్రశ్న ప్రస్తుతం మనకు అప్రస్తుతం... యిదుగో చూడు, కావాలంటే - మేం యాపిల్ తోటలలో తీసుకున్న ఫోటోలు!" అంటూ ఇన్ని ఫోటోలు తీశాడు పెట్లోంచి.

నిజమే! నిండుగా విరగకాసిన యాపిల్ చెట్ల మధ్యన బాబీ, వాడి స్నేహితులూ వివిధ భంగిమలలో కూర్చునీ నుంచునీ ఒక్కరుగా-సమూహంగా తీసుకున్న అనేక ఫోటోలు ఆ చెట్టు ఆకారానికీ, అందులో కన్పిస్తూన్న కొమ్మలూ - ఆకుల తీరుకూ, తాడల్లే ఎదిగిపోయిన మా చెట్టుకూ ఎక్కడా పోలికే లేదు.

అమ్మమ్మగారు ఫోటోలను పరిశీలనగా చూస్తూంటే,

మేము ఉత్సుకతతో ఆమె ముఖాన్ని చూడసాగాము. కాని ఆమెగారి వదనంలో మాకేభావమూ ప్రస్ఫుటం కాలేదు. హుందాతో కూడిన మౌన గంభీర ముద్రను దాల్చారు. అయినా అంతరంగంలో ఎక్కడో కొద్ది బాధ వుండకపోదని నే ననుకుంటాను. ఎప్పుడూ నిర్మొహమాటంగా ఏవో కామెంట్స్ విసిరే చిన్నన్నయ్య కూడా మౌనంగా వుండి పోయా డాక్షణంలో.

"అడపాదడపా నాకూ ఒకటీ రెండూ ఆపిలుకాయలు దొరుకుతుంటై గదా అని ఆశపడ్డాను. అసలు నా నోరు మంచిదిగాకపోనాది" అంటూ గొణుక్కుంది రామి.